నేడు కలెక్టరేట్ ఎదుట సీపీఎం మహాధర్నా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 6 : జనగామ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉదయం మహాధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ అధ్యక్షుడు జోగు ప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాణాపురం వద్ద నిర్మిస్తున్న హైవే (ఎన్‌హెచ్ 163)పై ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా బైపాస్ రోడ్డు నిర్మించాలనే డిమాండ్‌తో మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. 69 రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టినా కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆందోళన చేపడుతున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై మహాధర్నాను విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

జఫర్‌గఢ్, ఏప్రిల్ 6 : మండలంలోని ఉప్పుగల్లు శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయమై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయంలో చోరీ చేసిన దుండగులను గుర్తించి శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పులి ధనుంజయ్, గొల్లపల్లి రాజు, వడ్లకొండ మధు పాల్గొన్నారు.

నోటీసులు జారీ చేసినా ఆగని అక్రమ నిర్మాణాలు

తరిగొప్పుల, ఏప్రిల్ 6 : నోటీసులు జారీ చేసినా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులపై నాగపురి రమేశ్ మండిపడ్డారు. మండలంలోని అంకుషాపూర్‌లో స్కూల్ పక్క నుంచి ఎల్లమ్మ గుడి వరకు వర్షపు నీరు వెళ్లే కాలువ(ఒర్రె)పై మహ్మద్ సలీం అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని మార్చి 18న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఆర్ఐ సర్వే చేసి, అది ప్రభుత్వ భూమి అని తేల్చడంతో భవన నిర్మాణదారుడికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు కూడా జారీ చేశారని తెలిపారు. అయితే, నోటీసులు అందుకున్న వ్యక్తి వాటిని బేఖాతరు చేస్తూ సెలవు దినాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నాడని రమేశ్ ఆరోపించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌ను వివరణ కోరగా తహసీల్దార్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశామని, అక్కడ ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 6 : దాడి ఘటనలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సూపర్ వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వంగాల నాగార్జున్‌ను శనివారం అదే కార్యాలయానికి చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ పీ శ్యామ్‌తో పాటు అతడి తమ్ముడు పీ సతీశ్ ఇద్దరు కలిసి దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ ఎస్సై రాజేశ్ కుమార్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, MOHAMMED ZIYA UR RAHAMAN (Old Name) H.No. 1-6-165, Bapuji Nagar, Kazipet, Mandal & Dist. Hanumakonda-506003 T.G, have Changed my name from MOHAMMED ZIYA UR RAHAMAN TO MOHAMMED ZIYAUDDIN (New Name) S/o MOHAMMED KHAJA MOINUDDIN. for all purposes.
NTW-6580

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

పాలకుర్తి : వల్మిడిలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, ఆర్‌డీవో వెంకన్న



పాలకుర్తి : వల్మిడి ఆలయంలో భక్తులకు వసతులు కల్పించకపోవడంతో నిల్చొని కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

చిల్పూరు : నష్కల్‌లో సీతారామచంద్రస్వామి కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య

కమనీయం.. రాములోరి కల్యాణం

- వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ఉత్సవాలు
- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- మార్మోగిన శ్రీరామ నామస్మరణం

పాలకుర్తి : పాటిమీది ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొని, పూజలు చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 6 : శ్రీరామ నవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. వేద పండితులు మంత్రాలు పఠిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయాలన్నీ శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. పాలకుర్తిలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, లింగాలఘనపురం మండలం జీడికల్‌లోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం, నవాబ్‌పేటలోని శ్రీకోదండ రామస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని పాతబీట్ బజార్‌లో గణేశ్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ శ్రీ రామనవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతా రాముల కల్యాణం నిర్వహించారు. శ్రీరాంనగర్ కాలనీ, మూలబావి, గీతాశ్రమం, గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయం, బాణాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, హెడ్‌పోస్టాఫీసు ఏరియాలోని శ్రీ సంతోషిమాత, గుండ్లగడ్డ శ్రీ ఆంజనేయ స్వామి, గిర్నిగడ్డ భక్త ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుక జరిగింది. బాలాజీనగర్ శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో, పాత బీట్ బజార్‌లో కల్యాణం జరిపించారు. వైశ్యరత్నాల సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే, వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు. కాగా, ఇక్కడ కల్యాణంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు నిలబడ్డారు. తలంబ్రాల కోసం ఎగబడ్డారు. ఎండకాలంలో భక్తులకు మంచినీటి వసతిని కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగానే ఏర్పాట్లు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా, ఇక్కడ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును భక్తులు తలచుకోవడం గమనార్హం. దయాకర్‌రావు ఉన్నప్పుడు సకల సౌకర్యాలతో ఏర్పాట్లు ఉండేవని భక్తులు గుర్తు చేసుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కల్యాణోత్సవానికి ఆహ్వానం ఎందుకు పంపాలేదని ఈవో మోహన్‌బాబుపై తాజా మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ పునఃనిర్మాణ సృష్టికర్త దయాకర్‌రావుకే ఆహ్వానం పంపరా? అని ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు ఈవోకు మాజీ జడ్పీటీసీకి వాగ్వాదం జరిగింది. కాగా, పాలకుర్తిలోని పాటిమీది ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులను ఎర్రబెల్లి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాముల పుణ్య దంపతుల ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు చల్లగా ఉండాలన్నారు. వల్మిడి, బమ్మెర, పాలకుర్తి ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దనన్నారు. వల్మిడిని మరో భద్రాద్రిగా తీర్చిదిద్దిన ఘనత తనకే దక్కుతుందన్నారు. పాటి మీది ఆంజనేయస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పట్టణ అధ్యక్షుడు కడుదుల కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, స్టేషన్‌ఘన్‌పూర్‌తోపాటు మండలంలోని శివునిపల్లి, తాటికొండ, పామునూర్, ఇప్పగూడెంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తాటికొండలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. చిల్పూరు మండలంలోని రాజవరం, చిల్పూరు, చిన్నపెండ్యాల, పల్లగుట్ట, నష్కల్ గ్రామాల్లో జరిగిన ఉత్సవాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజయ్య నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ, సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, జనగామ మండలంలోని శామీర్‌పేట, పెంబర్తిలో, దేవరుప్పుల మండలం చినమడూరులో, తరిగొప్పుల మండలంలో, నర్మెట మండల కేంద్రంతోపాటు వెల్దండ, హన్మంతాపూర్, అమ్మాపురం, మచ్చుపహాడ్, కొడకండ్ల మండల కేంద్రంతోపాటు రామవరం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో, లింగాలఘనపురంలో, జఫర్‌గఢ్ మండలంలోని కూనూరు సాగరం, తిమ్మంపేట, ఉప్పుగల్లు, కోణాయిచలం, తిరుగు గ్రామాల్లో, రఘునాథపల్లి మండలంలో, బచ్చన్నపేట మండల కేంద్రంలోని మార్కేండేయ ఆలయం, చెన్నకేశవ ఆలయంతో పాటు ఆలింపూర్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

లింగాలఘనపురం : జీడికల్‌లోని ఆలయంలో కల్యాణోత్సవంలో తాళిబొట్టును చూపెడుతున్న పూజారి మురళీకృష్ణ

జనగామ : శ్రీరాంనగర్ కాలనీ మూలబావి ఆలయంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



స్టేషన్‌ఘన్‌పూర్ : తాటికొండలో కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అనుమతి లేని ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సీజ్ చేసిన ట్రాక్టర్లతో ఎస్సై సృజన్‌కుమార్

దేవరుప్పుల, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని మన్‌పహాడ్ గ్రామంలోని వాగు నుంచి శనివారం అర్ధరాత్రి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని, సీజ్ చేసినట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. మన్‌పహాడ్ వాగులో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులతో అక్కడకు వెళ్లగా బోడకుంట తండాకు చెందిన భూక్యా రవి, ధరావత్ మోహన్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు ఇసుకను లోడ్ చేసి కనిపించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను సీజ్ చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా దేవరుప్పుల వాగు నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు యాకేశ్, గౌస్ పాషా, ప్రవీణ్ పాల్గొన్నారు.

సదాశివపేటలో..

బచ్చన్నపేట, ఏప్రిల్ 6 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని సదాశివపేట వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా దాచేపల్లి నర్సింగరావు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హమీద్ తెలిపారు.



తాటికొండ గ్రామంలో ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాముడి ఆస్తి ఎక్కడ ?

రాముడి కల్యాణోత్సవంలో వెలిసిన ఫ్లెక్సీ
తాటికొండలో చర్చనీయాంశం

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 6 : మండలంలోని తాటికొండ గ్రామంలో రాముల వారి కల్యాణోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయ ఆవరణలో 'సీతరామచంద్ర స్వామి స్థిర ఆస్తులు ఎక్కడ?, రాముడిని ఏమి లేనివాడుగా చేసిందెవరు?' అంటూ స్థానికుడు నారబోయిన శ్రీనివాస్ కల్యాణ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీతరామచంద్ర స్వామి దేవుడి పేరుపై 430 నుంచి 448, 454 సర్వే నంబర్‌లో 86.35 ఎకరాల భూమి ఉంది. ఆలయ అర్చకుడు మృతి చెందగా అతని కొంత భూమిని ఇచ్చారు. 15 ఎకరాలు గుట్ట వైపు ఉండగా సుమారు పది మంది వ్యక్తులు 50 ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. గత ఏడాది తహసీల్దార్ కార్యాలయానికి ఈ విషయం తెలిసిందన్నారు. రాముడి పేరుపై భూమిని కౌలుకు ఇచ్చినప్పటికీ కౌలు పైసలు కల్యాణోత్సవానికి ఎందుకు వాడడం లేదన్నారు. అసలు కౌలు పైసలు వస్తున్నాయా? లేదా? అని ప్రశ్నించారు. పది రోజుల క్రితం ఎండోమెంట్ భూమిలో చెట్లను ఎలా కొట్టివేశారని నిలదీశారు. రాముని భూమిని పట్టా చేయించుకున్నది ఎవరు? అది తిరిగి వస్తుందా? దీనికి బాధ్యులు ఎవరు? అనేది ప్రజల్లో చర్చ రావడానికే ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు, ఏప్రిల్ 6 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని నారగోని రాజు ఇంటి వద్ద, బీఆర్ఎస్ పార్టీ చిల్పూరు మండల ఇన్‌చార్జ్ మలోత్ రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాజయ్య పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు చిల్పూర్ మండలం నుంచి సుమారుగా 5వేల మంది పాల్గొనేలా నాయకులు, కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మండలానికి పదేళ్లలో కేసీఆర్ ఎన్నో రకాలుగా మేలు చేశారన్నారు. వేలేరు మండలానికి చెందిన పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో రోడ్ల విషయంలో కానీ, నీళ్ల విషయంలో కానీ, ప్రత్యేక మండలం చేసుకోవడంలో కానీ అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో కానీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి చేయడంలో గాని బీఆర్ఎస్ అందరి ఇంటి పార్టీగా పనిచేసిందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మహాసభకు కదలి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చిల్పూర్ మండల మాజీ ప్రజా ప్రతినిధులు, మండల ఇన్‌చార్జి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌నాయక్, మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, చిల్పూరు మండల బీసీ సెల్ అధ్యక్షుడు, మండల నాయకుడు నారగోని రాజు గౌడ్, నష్కల్ మాజీ ఉపసర్పంచ్ చిర్ర రాజుగౌడ్, చిల్పూరు మండల యూత్ అధ్యక్షుడు నారగోని రవిచంద్ర, బీఆర్ఎస్‌గ్రామశాఖ అధ్యక్షులు గుంటి భీములు, రచ్చ రవీందర్, ఆరూరి స్వామి, వెంకన్న, ఎండీ యాకూబ్‌పాషా, మండల నాయకులు శాగ వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీనివాస్, మల్లయ్య, మహిపాల్, రజాబాబు, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీను, కోటి, వెంకట స్వామి, రవి పాల్గొన్నారు.

చిల్పూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

గుండ్లసాగర్ గ్రామంలో..

వేలేరు : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య కోరారు. ఈ మేరకు వేలేరు మండలంలోని గుండ్లసాగర్‌లో బీఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి భూపతిరాజ్, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ధర్మసాగర్ : మండలంలోని దేవునూర్ గ్రామంలో మాజీ వార్డు సభ్యుడు నర్సింగరావు, రాపాకపల్లె గ్రామంలో సునీల్ మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శించారు. పార్టీ పరంగా కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి కర్ర సోమిరెడ్డి, లక్క శ్రీనివాస్ పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఎలుకుర్తిలో పార్టీ జెండా గద్దెకు భూమి పూజ

ధర్మసాగర్ మండలం ఎలుకుర్తిలో బీఆర్ఎస్ జెండా గద్దెకు మాజీ ఎమ్మెల్యే రాజయ్య భూమి పూజ చేశారు. ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామం నుంచి 1000 మంది తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బేరే హరీశ్, సోమిరెడ్డి, సురేశ్, దేవేందర్‌రావు, మధుకర్ పాల్గొన్నారు.

'పాస్టర్ అజయ్ బాబు ఆచూకీ తెలపాలి'

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 6 : ఖమ్మంలో పాస్టర్ అజయ్ బాబును శనివారం రాత్రి ఆయన ఇంటి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకపోయారని, వెంటనే పోలీసులు అతడి ఆచూకీని తెలుపాలని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎన్‌సీసీ(నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్) అధ్యక్షుడు ఎన్ టెక్కా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ఏపీలో పాస్టర్ పగడాల ప్రవీన్ మృతిని మరువక ముందే అజయ్ బాబును అతడి భార్యా, పిల్లల ముందే పోలీసులమని చెప్పి కొందరు బలవంతంగా తీసుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, పాస్టర్ ప్రవీన్ మృతిపై విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బావి, బోరు ఉన్నా.. నీళ్లు లేవు

- మూడెకరాలు ఎండింది
- రామారంలో రైతు ఆవేదన

ఎండిన పొలంలో దిగాలుగా ఉన్న రైతు ఎల్లంల లింగమల్లు

కొడకండ్ల, ఏప్రిల్ 6 : బావి, బోరు ఉన్నా నీళ్లులేక పంట ఎండిపోతోందని మండలంలోని రామారం గ్రామానికి చెందిన రైతు ఎల్లంల లింగమల్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తన బాధ ఆయన మాటల్లోనే.. 'మాకు మూడెకారల పొలం ఉంది. దానికి ఒక పొత్తుల బావి, మా స్వంతంగా బోరు కూడా ఉంది. ఇదివరకు మాకు వాన కాలం పంటకు నీరు పుష్కలంగా ఉండేది. యాసంగిలో బోరు మోటరు, పొత్తుల బావి మోటరుతో నీళ్లు పారి 3 ఎకరాల పంట చేతికి వచ్చేది. ఈ సారి బోరు, బావిలో రెండింటిలో నీరు లేక 2 ఎకరాలకు పైగా పంట ఎండింది. మాకు లాభం రాకపోయిన పెట్టుబడి వస్తది అనుకున్నం. కానీ ఇప్పుడు నష్టంతో అప్పుల పాలవుతున్నం. ఎంతో మంచిగా చూసుకున్న పంట ఇట్లా ఎండిపోవడంతో చానా బాధ అయితాంది. ఎండిపోయిన పొలంలో మాకు ఉన్న గొర్లను మెపుతున్నాం.'

నేడు బీఆర్ఎస్ సమావేశానికి ఎమ్మెల్యే పల్లా రాక

బచ్చన్నపేట. ఏప్రిల్ 6 : మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో సోమవారం బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉమ్మడి వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మండల పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగే సమావేశానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు పలువురు నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆవిర్భవ సభకు జన సమీకరణ కోసం నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, డైరెక్టర్లు, ముఖ్య కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, మైనార్టీ నాయకులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ టవర్ వద్ద టీజీఆర్ఎస్ విద్యార్థులు

సైబర్ టవర్‌ను సందర్శించిన విద్యార్థులు

కొడకండ్ల, ఏప్రిల్ 6 : మండలకేంద్రానికి టీజీఆర్ఎస్ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని సైబర్ టవర్స్‌ను సందర్శించారు. విశ్వనగరమైన హైదరాబాద్ అభివృద్ధిని చూడడంతోపాటు, అక్కడి స్టాండర్డ్స్ ఆఫ్ లివింగ్‌ను పిల్లలకు పరిచయం చేయడానికి ఈ ప్రయత్నం చేసినట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలిప్‌కుమార్ తెలిపారు. అలాగే, నగరంలో మెట్రో రైలు ప్రయాణం అనుభవాన్ని కూడా పిల్లలకు చూపించినట్లు ఆయన వివరించారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

దేవరుప్పుల, ఏప్రిల్ 6 : దేవరుప్పుల, లింగాలఘనపురం మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను లింగాలఘనపురం విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు మండల సబ్ డివిజన్ ఏడీఈ అనిల్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ పరిష్కార వేదికలో సీజీఆర్ఎఫ్-1 చైర్మన్ ఎన్వీ వేణుగోపాలాచారి, సాంకేతిక సభ్యుడు రమేశ్, ఆర్థిక సభ్యుడు చరణ్‌దాస్, స్వతంత్ర సభ్యుడు రామారావు పాల్గొంటారని తెలిపారు. దేవరుప్పుల మండల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ వేదికలో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుట, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, ఎక్కువ వచ్చిన బిల్లుల పరిష్కారం, కేటగిరీ మార్పు, సర్వీసు రద్దు లాంటి అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏడీఈ వివరించారు.

ఏబీవీ డిగ్రీ కాలేజీ తొలి ప్రిన్సిపాల్ అంజయ్య మృతి

కాసం అంజయ్య(ఫైల్)

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 6 : జనగామ ఆంధ్ర భాషాభివర్ధిని (ఏబీవీ) డిగ్రీ కళాశాల తొలి ప్రిన్సిపాల్, లయన్స్ క్లబ్ చార్టర్ కార్యదర్శి కాసం అంజయ్య(82) ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో తుది శ్వాస విడిచారు. మధ్యాహ్నం జనగామ జిల్లా కేంద్రంలోని గీతానగర్‌లోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని సందర్శకుల నిమిత్తం ఉంచగా పట్టణ ప్రముఖులతో పాటు పూర్వ విద్యార్థులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం స్థానిక నెహ్రూపార్కు వద్ద గల శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అంజయ్యకు భార్య ఉండగా ఆమె కొన్నేళ్ల క్రితమే మరణించారు. 1943లో జన్మించిన అంజయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1966లో వరంగల్ సీకేఎం కళాశాలలో అధ్యాపక వృత్తి ప్రారంభించి, ప్రిన్సిపాల్‌గా ఎదిగారు. పుట్టిన ఊరుపై మమకారంతో జనగామ ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించి, కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించారు. అనేక మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో అంజయ్య ఎనలేని కృషి అందించారు. 2001లో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేసి లయన్స్ క్లబ్ ద్వారా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అంతిమ యాత్రలో కేయూ మాజీ వీసీ డాక్టర్ వంగాల గోపాల్‌రెడ్డి, పూర్వ ఆచార్యులు టీ సుధాకర్‌రెడ్డి, రమణయ్య, శంకరయ్య, కన్నపరశురాములు, విద్యాసాగర్‌రెడ్డి, తీగల మోహన్‌రావు,